క్లుప్తంగా

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ విజయలక్ష్మి

బలిజిపేట: బలిజిపేట ఎంపీడీఓగా కె.వి జయలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఇంతవరకు గుమ లక్ష్మీపురం ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఎంపీడీఓగా భానుమూర్తి బాధ్యతలు నిర్వహించిన విషయం విదితమే.

నేడు ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ

సీతానగరం: మండలంలోని జానుమల్లువలసలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం మంచినీటి పథకానికి సంబంధించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ జానుమల్లువలస గ్రామస్తులు దీర్ఘకాలంగా ఓవర్‌హెడ్ ట్యాంక్ లేక తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో ఎమ్మెల్యే తెలుసుకుని, జీజీఎంపీ నిధులు రూ.20 లక్షలు ఓవర్‌హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి మంజూరు చేశారని చెప్పారు. ఈ నిధులతో ట్యాంక్ నిర్మాణం కోసం భూమిపూజ చేయనున్నట్లు వివరించారు.

సాగునీటి నిల్వ పెంచేందుకు ఉపాధి పనులు



కూర్మినాయుడు చెరువులో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలో రానున్న ఖరీఫ్‌సీజన్‌లో వర్షాధార పంట భూములకు చెరువుల్లో సాగునీటి నిల్వలు పెంపొందించడానికి ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేపడుతున్నామని ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని సూరంపేటలో గల కూర్మినాయుడు చెరువులో వేతనదారులు చేస్తున్న మట్టి పనులను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులతో ఉపాధిహామీ పనులు చేపట్టడం వల్ల వారికి ఉపాధి, ఆయకట్టు భూములున్న రైతులకు అత్యవసర పరిస్థితుల్లో సాగునీటి వినియోగానికి చెరువుల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకూ 280 చెరువుల్లో చెరువు గర్భాలను లోతు చేయడం వల్ల చెరువుగట్ల అభివృద్ధి, కల్వర్టుల నిర్మాణం, చప్టాల నిర్మాణం పూర్తి చేయడానికి సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. నిర్ధారించిన పనులు పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ సీజనుకు ఆయకట్టు భూములకు సమృద్ధిగా సాగునీరు సమకూర్చడానికి తమవంతు పనులు చేస్తున్నామని చెప్పారు. అలాగే పంట భూములలో రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ఇళ్లకు చేర్చడానికి అవసరమైన రోడ్లు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం ప్రారంభం

గరుగుబిల్లి: సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జట్టు ట్రస్టీ డి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లిలో ఉన్న ప్రకృతి ఆదిదేవో భవ ప్రాంగణంలోని జట్టు నూతన కార్యాలయ ప్రాంగణంలో సేంద్రియ ఎరువులైన ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, పంచగవ్య, వర్మీకంపోస్టు తదితర ఎరువుల తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వినియోగించి సాగు చేసిన పంటలు ఆరోగ్యానికి మంచివని, ఈ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. రైతులు సేంద్రియ సాగు విధానంలో పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపాలని కోరారు. ఘన జీవామృతంను కిలో రూ.13లు, వర్మీకంపోస్టు కిలో రూ.16లు చొప్పున్న అన్నపూర్ణేశ్వరీ రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు చెప్పా రు. అలాగే ఆవు పచ్చిపేడను కిలో ఒక రూపాయికి, ఆవు మూత్రాన్ని లీటర్ రూ.5లకు రైతు ఉత్పత్తిదారుల సంఘం కొనుగోలు చేస్తుందని తెలిపారు.

10న రేణుకాదేవి విగ్రహ ప్రతిష్ట

కురుపాం: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే అమ్మవారిగా భక్తులచే పూజలందుకుంటున్న రేణుకాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఈ నెల 8,9,10 తేదీల్లో నిర్వహించనున్నట్లు నెల్లి శ్రీనివాసరావు, సరళ తెలిపారు. స్థానిక షిర్డీసాయి ద్వారకామయి ఆలయ ప్రాంగణలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేయనున్నట్లు పేర్కొన్నారు. 8న విఘ్నేశ్వర పూజ, ఆవాహనం, రేణుకాదేవి విగ్రహ తిరువీధి, కలశ యాత్ర, 9న ప్రత్యేక పూజలు, సామూహిక లలితా పారాయణం, హోమం, 10వ తేదీ శనివారం ఉదయం 7:35 నిమిషాలకు యంత్రం, విగ్రహ ప్రతిష్టాపన ఉంటాయన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అభివృద్ధి పథంలో పార్వతీపురం



గడపగడపకూ చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారన్నారు. పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలోగల 13వ వార్డు సచివాలయం, 29వ వార్డులో బుధవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో 235వ రోజు గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ వార్డుకు వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. వార్డులో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతుందా తదితర విషయాలు తెలుసుకునేందుకే తాము వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి

అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తోందని చెప్పారు. ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందజేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్న తీరును ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, ఎక్స్ వైస్ చైర్మన్ బెలగాం జయబాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ వి.శంకర్రావు, స్థానిక కౌన్సిలర్ ఎడ్ల త్రినాథ, అర్.చిన్నంనాయుడు, అర్ బంగారు నాయుడు, నిమ్మకాయల సుధీర్, కోరాడ శ్రీనివాసరావు (నాని), పి.జయంతి, ఎస్.లావణ్య, జేసీఎస్ కన్వీనర్ మాధవరావు, స్టేట్ డైరెక్టర్లు చెవిటి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సచివాలయం కన్వీనర్లు ఆర్వీఎస్ కుమార్, ఎం తవిటి నాయుడు, గండి భాగ్యవతి, ఎ.విజయ, సామల లలిత, బొంగు సురేష్, బి నగేష్, కె.చిట్టి, ఎస్. చంద్రరావు, పి.శ్రీనివాసరావు, కార్యకర్తలు, గృహ సారథులు, మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు మాయం



వైద్య సేవలందిస్తున్న ఆయుష్ డాక్టర్ హేమాక్షి

• ఆయుష్ డాక్టర్ టి.హేమాక్షి

సీతానగరం: దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన వారికి ఆయుర్వేద మందులతో నయం అవుతుందని బూర్జ ఆయుర్వేదిక్ ప్రభుత్వాస్పత్రి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. ఈ మేరకు బుధవారం పెదంకలాం గ్రామంలో ఆయుష్ వైద్యశిబిరాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అన్నిరకాల వ్యాధుల నివారణకు అవసరమైన మందులను అన్ని అస్పత్రులకు సమకూర్చిందని చెప్పారు. మందులున్న కారణంగా దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి క్షేత్రస్థాయిలోనే మెరుగైన వైద్య సేవలందించడానికి ఉచితవైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్వాసకోశ, జీర్ణకోశ, కీళ్లవాపులు నొప్పులు, రక్తలేమి కారణాలతో ఇబ్బందులు పడుతున్న వారికి గ్రామాల్లోనే రోగ నిర్ధారణచేసి 15 రోజులకు సరిపడా మందులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఆయుర్వేద మందుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, యోగాసనాలు వేయడంపై చైతన్యపరిచి వైద్య విజ్ఞానాన్ని పెంపొందించడానికి తమవంతు కృషి చేస్తున్నామని తెలియజేశారు. బూర్జ ఆయుర్వేద ఆస్పత్రిలో అన్నిరకాల వ్యాధుల నివారణకు మందులున్నాయని, ఆయుష్ మందుల వాడకం వల్ల ఇతరత్రా వ్యాధులు ఉత్పన్నం కావన్నారు. ప్రజల కోరిక మేరకు అన్నిగ్రామాల్లో ఆయుర్వేద ఉచితవైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రమణమ్మ, సర్పంచ్ బి.శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, ఆయుష్ వైద్య సిబ్బంది వై.పద్మ, రూప, నాగరాజు, పీహెచ్‌సీ ఏఎన్‌ఎం, ఆశవర్కర్ పాల్గొన్నారు.

వైద్య సేవలు అందించడం ఓ వరం

• డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు



ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు



వైద్యాధికారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు, తదితరులు

పార్వతీపురంటౌన్:

గ్రామాల్లో వైద్య సేవలు అందిచడం ఓ వరమని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. బుధవారం మండలంలోని బాలగుడబ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలకు మంచి స్పందన వస్తోందన్నారు. వైద్యశిబిరంలో అన్ని రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అందుబాటులో 62రకాల మందులు ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్లవద్దనే వైద్యసేవలను అందిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానంలో రోగులను కుటుంబ సభ్యుల్లా చూస్తున్నామని, రోగాల బారినపడి గ్రామాల్లో ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీకాంత్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

గర్భస్రావం, గర్భనిరోధక పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలి

గర్భస్రావం, గర్భ నిరోధక పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ బి.వాగ్దేవి వైద్యాధికారులకు సూచించారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఆస్పత్రిలో గర్భస్రావం, గర్భ నిరోధక పద్ధతులపై శిక్షణ పొందిన వైద్యాధికారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సురక్షితమైన నిబంధనలతో కూడిన పద్ధతుల ద్వారా గర్భస్రావం, గర్భనిరోధక పద్ధతులు అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ బి.జగన్‌మోహన్‌రావు, స్త్రీ వైద్యనిపుణురాలు డాక్టర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సు కోరే ప్రభుత్వం

• ఎమ్మెల్యే జోగారావు



వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: రైతు శ్రేయస్సుకోరే రైతు ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని నర్సిపురంలో రైతు భరోసా కేంద్రంలో రైతన్నలకు రాయితీపై వరి విత్తనాలను అయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతుల శ్రేయస్సు కోసం ఆర్బీకేల ద్వారా విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. విత్తనాల నుంచి పంట అమ్ముకునే వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. ఆర్బీకేల్లో 1064, ఎంటీయూ1121, సాంబ, సోనామసూరి, ఆర్జీఎల్ తదితర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, ఆత్మచైర్మన్ యాండ్రాపు తిరుపతిరావు, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్ వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూసర్వే నిర్వహించాలి

• జేసీ ఆర్.గోవిందరావు

గుమ్మలక్ష్మీపురం: భూముల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. మండలంలోని ఎగువ తాడికొండ గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే ఎంతవరకు పూర్తయిందని, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భూయజమానుల సమస్యలను పరిష్కరించాలని, నిర్దేశించిన సమయంలోగా సర్వే పూర్తిచేయాలని సూచించారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ నూరల్ కమర్, తహసీల్దార్ జె.రాములమ్మ, సర్వేయర్ రమణమూర్తి, సర్పంచ్ ఎం.జగ్గారావు ఉన్నారు.

సమన్వయంతో పనిచేయండి



మెంటాడ మండలం నాయకులతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

• ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సంక్షేమ సారథి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ ముఖ్యమంత్రిగా పట్టం కట్టేందుకు కృషి చేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన సాలూరు పట్టణంలోని తన గృహంలో మెంటాడ మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా, అత్యంత పారదర్శకంగా, అవినీతి రహితంగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో ఇంకా ఏమైనా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే జిల్లా అధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి మంజూరుచేయిస్తానని స్పష్టం చేశారు. అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కాగా గుర్ల గెడ్డ మినీ రిజర్వాయర్ గురించి నాయకులు ప్రస్తావించగా, గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నికల నేపథ్యంలో శంకుస్థాపన చేశారని, మినీ రిజర్వాయర్‌కు రూ.15కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, నిధుల మంజూరుకోసం ముఖ్యమంత్రితో మాట్లాడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు రెడ్డి సన్యాసప్పలనాయుడు, లెంక రత్నాకర్, ఈశ్వరరావు, త్రినాథరావు తదితరులు ఉన్నారు.

గంటందొర త్యాగం మరువలేనిది

మన్యం పులి అల్లూరి సీతారామరాజు వదిలిన గిరిజన బాణం గాం గంటందొర అని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర కొనియాడారు. స్వాతంత్య్ర సమర యోధుడు గంటందొర వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన తన గృహంలో గంటందొర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు వెంట నడుస్తూ, స్వాతంత్య్రసమర యోధుడిగా, గిరిజన నాయకుడుగా గంటందొర చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార ప్రమాణాలు జీవితాన్ని కాపాడతాయి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఆహార భద్రతాధికారి వై.రామయ్య

పార్వతీపురంటౌన్: ఆహార ప్రమాణాలు జీవితాన్ని కాపాడతాయని జిల్లా ఆహార భద్రతాధికారి వై.రామయ్య అన్నారు. ఈ మేరకు జిల్లా ఆహార భద్రత ప్రమాణాల శాఖాధికారి కార్యాలయంలో ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార ప్రమాణాలు-జీవితాన్ని కాపాడుతాయని, ఆహార పదార్థాల నాణ్యత చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంస్థలు నిర్దేశించిన నిబంధనలు పాటించాలని, ప్రతి ఆహార తయారీ సంస్థ విధిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. నీటి వినియోగం, పాత్రలను శుభ్రం చేయడంతో సహా ప్రతి అంశంలో స్పష్టమైన ప్రమాణాలు పాటించి వినియోగదారుల ఆహార, ఆరోగ్య రక్షణలో రాజీ పడకుండా ఉండాలని కోరారు. ఆహార భద్రతాధికారి పి.వెంకటరమణ ఆహార భద్రత గురించి తెలియచేశారు. సమావేశంలో వర్తక సంఘం, హోటల్, ఇతర వ్యాపార నిర్వాహకులు పాల్గొన్నారు.

రాజన్నదొరతోనే గిరిశిఖర గ్రామాల అభివృద్ధి సాధ్యం



వాలీబాల్ ఆటను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు దండి శ్రీనువాసరావు తదితరులు

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడికరాజన్నదొరతోనే గిరిశిఖర గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతోందని సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు దండి శ్రీనువాసరావు, మువ్వల ఆదయ్య, చోడిపల్లి బీసు తదితరులు అన్నారు. ఈ మేరకు మండలంలోని కొదమలో స్థానిక ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు చోడిపల్లి సుసుమ, కూనేటి రోహిణి, కొదమ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో బుధవారం వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొదమకు రాజన్నదొర ప్రత్యేక చొరవతో రోడ్డు నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధికి చిత్తశుద్ధితో రాజన్నదొర పనిచేస్తున్నారని వివరించారు. ఎన్నికల వేళ గిరిజనులను మభ్య పెట్టేందుకు కొందరు టీడీపీ నాయకులు అబద్ధాలు చెప్పుకుంటూ వస్తున్నారని విమర్శించారు.మంచి చేసేది రాజన్నదొర అని, మోసం చేసేది టీడీపీ అని పేర్కొన్నారు. అందరు రాజన్నదొరకు అండగా ఉంటూ రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడానికి కృషి చేయాలని కోరారు. 34 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో అలగరువు గ్రామం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, చిలకమెండంగి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన



బద్నాయ వలసలో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పాచిపెంట:

కలెక్టర్ నిషాంత్ కుమార్ బుధవారం పాచిపెంట మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మండలంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా బద్నాయవలస ఎంపీపీ స్కూల్‌లో జరుగుతున్న నాడు నేడు పనులను తనిఖీ చేశారు. పాఠశాల ప్రారంభించే నాటికి పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఎక్కువ మంది ఉన్నారని అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని ఎంఈఓ జోగారావు ఆయన దృష్టికి తీసుకురాగా కలెక్టర్ స్పందించి నాడు నేడు నిధులతో తాత్కాలికంగా తరగతి గది నిర్మాణం చేపట్టాలని సూచించారు. అనంతరం కుంతాము నుంచి తుమ్మి గుడ్డి, మెట్ట గుడ్డి మీదుగా నిర్మిస్తున్న రహదారి పనులు పరిశీలించారు. ఆ పనులకు సంబంధించిన వివరాలను ఎస్‌ఈని అడిగి తెలుసుకున్నారు. తర్వాత వేటగాని వలస నుంచి సతాబి, తంగలాం మీదుగా నిర్మిస్తున్న అరకు రహదారి పనులను పరిశీలించారు. పర్యటనలో ఆయన వెంట డీఈఓ ప్రేమ్‌కుమార్ తహసీల్దార్ ఎం.రాజశేఖర్, పీఆర్ డీఈ చిన్నంనాయుడు మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయలు గౌరీశ్వరరావు తదితరులు ఉన్నారు.



ఘటాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

దీవించమ్మా..

పార్వతీపురంటౌన్:

మండలంలోని సంగంవలస గ్రామంలో గ్రామ దేవత బంగారమ్మ తల్లి వారాల పండగను భక్తులు వేడుకగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం మేళతాళాలు, డబ్బు వాయిద్యాల నడుమ గ్రామంలో ఘనంగా ఊరేగింపు చేపట్టారు. ఏటా ఖరీఫ్ పనులు నిర్వహించే ముందు అమ్మవారికి పండగ చేసి మొక్కులు తీర్చుకోవడం దశాబ్దాలుగా గ్రామ ప్రజలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో ప్రజలంతా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.